# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 19-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 175 పేజీలు: 8 వెల: రూ.1/-


## యువజంట ఆత్మహత్యాయత్నం

### భర్తమృతి.. భార్య పరిస్థితి విషమం

యాదాద్రి భువనగిరి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): భువనగిరిలోని ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. దంపతులు మూడు రోజుల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరిని వలిగొండ మండలం జంగారెడ్డిపల్లి వాసులుగా పోలీసులు గుర్తించారు. యువతి బంధువులే చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# పట్టణ ప్రణాళికపై సిఎం కేసీఆర్ చర్చ

హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): ప్రగతి భవన్‌లో మంగళవారం జరుగుతున్న పట్టణ ప్రగతి ప్రణాళిక సన్నాహక సదస్సును తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బహిష్కరించారు. ఈ సమావేశానికి హాజరుకావాలని కాంగ్రెస్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, సీతక్క, పొడెం వీరయ్య తదితరులను ప్రభుత్వం ఆహ్వానించింది. సదస్సుకు హాజరుకావాలని ఎమ్మెల్యేలకు కలెక్టర్ల నుంచి ఫోన్లు వచ్చాయి. అయితే ఈ సమావేశానికి వెళ్లడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని భావించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పట్టణ ప్రగతి సదస్సును బహిష్కరించారు.

కాగా ప్రగతిభవన్‌లో జరుగుతున్న

### సమావేశానికి డుమ్మాకొట్టిన కాంగ్రెస్ నేతలు

సమావేశానికి తొలిసారి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆహ్వానం అందింది.ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పురపాలక సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సులో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణ ప్రగతి కార్యాచరణతో పాటు విధివిధానాలు ఖరారు చేయనున్నారు సీఎం కేసీఆర్. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు సీఎం కేసీఆర్ మార్గనిర్దేశర చేయనున్నారు.

# మహారాష్ట్ర పోలీసుల తీరుపై మండిపడ్డ పవార్

### లీకయిన ఎల్గార్ పరిషత్ కేసు సిట్ వ్యవహారం

### కేంద్రానికి సమాచారం అందడంపై ఆగ్రహం

ముంబై,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ శరద్ పవార్ మహారాష్ట్ర పోలీసులపై మండిపడ్డారు. ఎల్గార్ పరిషత్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేయడం కోసం ఏర్పాటు చేసిన అంతర్గత సమావేశం గురించి కేంద్ర ప్రభుత్వానికి ఎలా తెలిసిందని నిలదీశారు. తాను గతంలో మహారాష్ట్ర పోలీసులను చూసి గర్వించేవాడినని, ప్రస్తుత పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శరద్ పవార్ మంగళవారం వైబీ చవాన్ సెంటర్ వద్ద విలేకర్లతో మాట్లాడారు.ఎల్గార్ పరిషత్ కేసులో పోలీసుల పాత్రను శరద్ పవార్ ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తును సిట్‌కు అప్పగించేందుకు ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌లతో జరిగిన అంతర్గత సమావేశం సమాచారం కేంద్ర ప్రభుత్వానికి ఎలా తెలిసిందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో ఎవరో ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసి ఉంటారనే అనుమానం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించవలసి ఉందన్నారు. మహారాష్ట్ర హోం శాఖను తాను సుమారు ఇరవయ్యేళ్ళు నిర్వహించినట్లు చెప్తూ, తాను మహారాష్ట్ర పోలీసులను చూసి గర్వించే వాడినన్నారు. అటువంటి పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడటం ఆందోళనకరంగా ఉందన్నారు. ఎల్గార్ పరిషత్ కేసులో పుణెళి పోలీసులు, కొందరు సీనియర్ పోలీసు అధికారుల పాత్ర ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ఆ పరిషత్‌లో పాల్గొననివారిపై కూడా కేసులు పెట్టారన్నారు.

## ఆగ్రా హైవేపై ప్రమాదం: నలుగురు మృతి

లక్నో,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. సోమవారం రాత్రి ఆగ్రా – లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై కారు – బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బాలిక పట్ల ఫోటోగ్రాఫర్ అసభ్య ప్రవర్తన

### చితకబాదిన స్థానికులు

హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): సైనిక్‌పురిలో ఓ బాలిక పట్ల ఫోటోగ్రాఫర్ అసభ్యంగా ప్రవర్తించాడు. ఫోటో తీయించుకునేందుకు ఉదయం బాలిక.. సలీం స్టూడియోకు వెళ్లింది. ఫోటో తీస్తున్న క్రమంలో బాలిక వద్దకు వెళ్లిన సలీం.. ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడ్డ బాలిక కేకలు వేసుకుంటూ స్టూడియో నుంచి బయటకు వచ్చింది. బాలిక కేకలు విన్న స్థానికులు అప్రమత్తమై స్టూడియో యజమాని సలీంను పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో అతనికి గాయాలయ్యాయి. సైనిక్‌పురిలోని ఓ ఆస్పత్రిలో సలీం చికిత్స పొందుతున్నాడు. నేరేడ్‌మెట్ పోలీసు స్టేషన్‌లో సలీంపై బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణపై కేంద్రానికి వివక్ష లేదు

### రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.2602కోట్లు మంజూరు

### చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు కేంద్ర మంత్రి పీయూష్ శంకుస్థాపన



హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ) : తెలంగాణపై కేంద్రప్రభుత్వం వివక్ష చూపడంలేదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. రైల్వే ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరిగిందన్నది వాస్తవం కాదన్నారు. గత ఐదేళ్లలో తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.2602 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. మంగళవారం సికింద్రబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి హాజరయ్యారు. చర్లపల్లిలో శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి కేంద్రం రూ. 221 కోట్లు కేటాయించింది. యర్రగుంట, నంద్యాల సెక్షన్ విద్యుదీకరణకు వీడియో లింక్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 427 రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సేవలను ప్రారంభించామన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో దక్షిణ భారతదేశాన్ని రైల్వేశాఖ విస్మరించిందంటూ మంత్రి తలసాని చేసిన ఆరోపణల్ని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. యూపీఏ హయాంలో రూ.258 కోట్లే కేటాయించారనీ..ఎన్డీయే హయాంలో 2020-21 బ్జడెట్‌లో 2,602 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. దక్షిణ భారతదేశాన్ని కేంద్రం విస్మరిస్తోందనడం అవాస్తవమన్నారు. రాష్ట్రాలు సహకరిస్తేనే రైల్వే లైన్లు వేగంగా పూర్తవుతాయని చెప్పారు. రైల్వే కేటాయింపులు రాష్ట్రాల పరిధిలో ఉండవనీ.. జోనల్ పరిధిలోనే ఉంటాయని చెప్పారు. ఎంఎంటిఎస్ రెండో దశకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే పనులు త్వరితగతిన పూర్తవుతాయని ఆయన చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, చర్లపల్లి శాటిలైట్ రైల్వేస్టేషన్‌కు కేంద్రం రూ.221 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశకు చర్లపల్లి శాటిలైట్ ఎంతో ఉపయోగమన్నారు. యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ పూర్తి చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. 427 రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సేవలు కల్పించడం హర్షణీయమన్నారు. నత్తనడకన ఉన్న పనులను కేంద్రం వేగవంతం చేసిందన్నారు. తెలంగాణ, ఏపీ ప్రజల తరఫున కేంద్రానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రిక్షావాలాకు ప్రధాని మోడీ అభినందన

### వారణాసి పర్యటనలో ప్రధానితో భేటీ

లక్నో,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): వారణాసి పర్యటనలో భాగంగా ఈ నెల 16న ఓ రిక్షా కార్మికుడిని ప్రధాని నరేంద్ర మోదీ కలిశారు. ఈ రిక్షా కార్మికుడేవరో కాదు.. ఇటీవలే తన బిడ్డ వివాహానికి హాజరు కావాలని మోదీకి పెళ్లి పత్రిక పంపిన మంగల్ కేవత్. అయితే మోదీకి ఆ ఆహ్వానం అందడంతో.. పెళ్లి కుమార్తెకు ఆశీస్సులు తెలుపుతూ ప్రధాని.. కేవత్‌కు లేఖ రాశాడు. ఈ క్రమంలో వారణాసి పర్యటకు వచ్చిన మోదీ తానే స్వయంగా కేవత్‌ను పిలిపించుకుని.. అతని యోగక్షేమాలు అడిగారు. ఆరోగ్యం ఎలా ఉందని వాకబు చేశారు. ఈ సందర్భంగా మంగల్ కేవత్ మాట్లాడుతూ.. తన కుమార్తె పెళ్లి సందర్భంగా మొదటి ఆహ్వానాన్ని ప్రధాని మోదీకి పంపాను. ఢిల్లీలోని పీఎంవో కార్యాలయంలో ఫిబ్రవరి 8వ తేదీన తానే స్వయంగా పెళ్లి పత్రికను ఇచ్చాను. ఆ తర్వాత మోదీ నుంచి ఆశీస్సులు తెలుపుతూ లేఖ వచ్చింది. లేఖను చూసిన వెంటనే తాము ఎంతో సంభ్రమాశ్చర్యానికి గురయ్యాము అని కేవత్ తెలిపాడు. అయితే కేవత్ గంగా నది భక్తుడు. తనకు వచ్చిన ఆదాయంలో కొంత గంగా ప్రక్షాళన కోసం ఖర్చు పెట్టడం విశేషం. ఇక కేవత్ నివాసముంటున్న డోమ్రి గ్రామాన్ని నరేంద్ర మోదీ దత్తత తీసుకున్నారు.

## టుండా కేసులో మరోమారు తీర్పు వాయిదా

### మార్చి 3కు వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): ఉగ్రవాది అబ్దుల్ కరీం టుండా కేసులో తుదితీర్పు మరోసారి వాయిదా పడింది. మార్చి 3వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు నాంపల్లి ప్రత్యేక కోర్టు వెల్లడించింది. గత నెల 21న తీర్పు వెల్లడించాల్సి ఉండగా మంగళవారం 18కి వాయిదా నాంపల్లి కోర్టు వేసింది. మంగళవారం కూడా తీర్పు వాయిదా పడింది.

ఉగ్రవాది టుండా ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జైల్లో ఉంటున్నాడు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ ఉగ్రవాదిని నాంపల్లి ప్రత్యేక కోర్టు విచారించనుంది. హుమాయూన్‌నగర్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద పేలుళ్లకు టుండా కుట్ర పన్నాడు. సీసీఎస్‌లో పేలుళ్లకు కుట్ర పన్నిన కేసులో అబ్దుల్ నిందితుడిగా ఉన్నాడు. దేశ వ్యాప్తంగా పలుచోట్ల పేలుళ్లకు పాల్పడినట్లు టుండాపై అభియోగాలు ఉన్నాయి. లష్కరే తోయిబాలో అబ్దుల్ కరీం టుండా కీలకంగా పని చేశాడు. బాంబుల తయారీ, పేలుళ్లలో నిష్ణాతుడిగా ఆయనకు పేరుంది. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత పేలుళ్లకు పాల్పడ్డాడు. 1993లో ముంబయి వరుస పేలుళ్లలోనూ టుండా నిందితుడిగా ఉన్నాడు. ముంబయి పేలుళ్ల తర్వాత పాక్‌లో తలదాచుకున్నాడు. పాక్ నుంచే ఐఎస్ఐ, పలు ఉగ్రవాద సంస్థలతో అబ్దుల్ సంబంధాలు పెట్టుకున్నాడు. 2008లో ముంబయి ఉగ్రదాది తర్వాత టుండాను అప్పగించాలని పాక్‌ను భారత్ కోరింది. భారత్.. పాకిస్తాన్‌కు ఇచ్చిన 20 మంది ఉగ్రవాదుల జాబితాలోనూ అబ్దుల్ కరీం పేరుంది. 2013 ఆగస్టులో నేపాల్ సరిహద్దులో టుండాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కలిపి టుండాపై 40కి పైగా పేలుళ్ల కేసులు ఉన్నాయి.



వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం ఈర్ల తండాలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో మంత్రి నిరంజన్ రెడ్డి కూడా ఉన్నారు.

# అభివృద్ధిని సాకారం చేస్తున్నాం

### పేదలను ఆదుకునేలా కార్యక్రమాల పూర్తి

### కృష్ణానీటిని రప్పించి సాగునీటి కలను సాకారం చేసిన మంత్రి

### డబుల్ ఇళ్లను ప్రారంభించిన స్పీకర్ పోచారం

### ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ): పాలమూరు కరువు తీరా నీళ్లు వచ్చాయని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పొలమున్నా నీళ్లులేని చోటనే పేదరికం ఉంటుందని, ఇప్పుడా పరిస్థితి లేకుండా కృషి జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఇన్నాళ్లూ సాగునీరు రాలేదన్నారు.

ఖిల్లా ఘనపూర్ మండలం ఈర్ల తండాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రాష్ట్ర శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. స్పీకర్ పోచారం, మంత్రి నిరంజన్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి లబ్దిదారులతో నూతన గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు. పేదలకు ఇంటి కలను సాకారం చేసిన ఘనత సిఎం కెసిఆర్‌దేనని అన్నారు. ఖిలాఘనపురం మండలాన్ని అభివృద్ధి చేసే క్రమంలో మంత్రినిరంజన్ రెడ్డి కృషిని ఆయన అభినందించారు. డబుల్ ఇళ్లు పేదలకు వరంగా మారాయని అన్నారు. నీరులేనిచోటే పేదరికం ఉంటుందని, ప్రజలు వలస వెళతారని అన్నారు. దానిని నిరోధించే విధంగా ఈ ప్రాంతంలో నీటి వసతిని కల్పించడం జరిగిందన్నారు. గత పాలకులు ఐదేండ్ల కొకసారి ఓట్లేయించుకుని గెలిచి హైదరాబాద్‌లో కూర్చున్నారని అన్నారు. ప్రజల బాధలు తీర్చాలన్న బాధ్యతను మరిచారు. పంట పండితేనే పేదరికం పోతుందని గ్రహించి కేసీఆర్ సహకారంతో మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రికార్డు సమయంలో సాగునీళ్లు తేవడం అభినందనీయం అన్నారు. సిఎం కేసీఆర్‌ని ఒప్పించి, మెప్పించి కృష్ణమ్మ నీళ్లు తెచ్చి రైతుల పాదాలు కడిగిన నిరంజన్ రెడ్డి సంకల్పం గొప్పదన్నారు. పంట పండిస్తే రైతుకు కలిగే ఆనందం ఒకరైతుగా నాకు తెలుసన్నారు. పెళ్లయినా, ఇళ్లయినా నూరేళ్లపంట .. దానిని సాకారంచేసిన నేత కేసీఆర్ అని అన్నారు. కళ్యాణలక్ష్మితో, డబల్ బెడ్రూం ఇండ్లతో పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. పేద గిరిజన యువతి పరిస్థితి చూసి చలించి ఆడబిడ్డల పెండ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దని కేసీఆర్ కళ్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టారని అన్నారు. గతంలో పదిమంది పేర్లు రాసుకుని కొంతమంది ఇండ్లు కట్టుకున్నారు. అయితే కెసిఆర్ ప్రభుత్వం పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించిందని, దేశంలో ఎక్కడా డబల్ బెడ్రూం తరహా ఇండ్లను ఏ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించడం లేదన్నారు. కేసీఆర్ కిట్ – అమ్మఒడి, ఆసరా పెన్షన్లు దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలువుతున్నాయని అన్నారు. మంత్రి నిరంజన్ మాట్లాడుతూ పేదల కలను సాకారం చేస్తున్నామని, హామీ మేరకు వారికి ఇళ్లు కట్టించి ఇస్తున్నామని అన్నారు. ఇళ్లు రానివారికి కూడా త్వరలో కట్టించి ఇస్తామని అన్నారు. ఇచ్చిన హామీమేరకు పక్కాగా పనిచేస్తామని అన్నారు. ఆసల్యమైనా తమ హామీని నెరవేరుస్తా మని చెప్పారు. విమర్శలుచేసే వారికి ఇక్కడి అభివృద్ధి కార్యక్రమాలు చెంపపెట్టు అని అన్నారు. సిఎం కేసీఆర్ కలలు నిజం అవుతున్నాయన్నారు. అర్హులయిన నిరుపేదలకే డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నామని అన్నారు. 1400 డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి.

కొందరు డబల్ బెడ్రూం ఇండ్లు నిర్మించకుండా అడ్డుకున్నారు. స్థలాలు ఎంపికచేస్తే కోర్టులో కేసులువేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. మరో వెయ్యి ఇండ్ల మంజూరుకు శాసనసభాపతి పోచారం సహకరించాలని ఈ సందర్భంగా విన్నవించారు. వరసక్రమంలో అందరికీ ఇండ్లు వస్తాయని, ఆలస్యమయిందని అధైర్య పడొద్దన్నారు. కర్నెతండా లిఫ్ట్ తో సాగునీరు అందిస్తామని, ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో దానిని సాధిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇకపోతే వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, కూరగాయల మార్కెట్, పార్కులను ఈ సందర్భంగా స్పీకర్, మంత్రి ప్రారంభించారు. హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, మున్సిపల్ చైర్మన్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినందునా త్వరగా కార్యక్రమాలను నిర్వహించుకునేలా ఏర్పాటు చేశారు. వీపనగండ్ల మండలంలోనూ అభివృద్ధి కార్యక్రమాల్లో వీరు పాల్గొన్నారు.

## కేసీఆర్‌చే ఇండియాలో ఫెడరలిజం పుస్తకావిష్కరణ



తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మ దినం సందర్భంగా సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు రచించిన "ఇండియాలో ఫెడరలిజం" పుస్తకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. ప్రగతి భవన్‌లో సాగిన జన్మదిన వేడుకల్లో ఈ ఆవిష్కరణ జరిగింది. భారత దేశంలో నూతన లక్ష్యాలతో ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత గురించి కెసిఆర్ ఇచ్చిన పిలుపునసరించి అనేకకోణాలలో విశ్లేషించిన ఈ గ్రంథం కేసిఆర్ గారికి జన్మదిన కానుకగా అంకితం ఇవ్వడం జరిగిందని బి.యస్.రాములు తెలిపారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఆ ఛ్ఛోదన మొనరించుచు
నా ఛ్ఛాదనకై వెదుకక నమిత బలుండై
మ్లేచ్ఛుల పై పోరాడుచు
స్వేచ్ఛా వాయువులు నింపె వీరశివాజీ!!



-రాధశ్రీ

సెల్: 9494481210

(ఫిబ్రవరి 19 ఛత్రపత్తి శివాజీ జయంతి)




హైదరాబాద్‌లో వేగంగా వెళుతూ భరత్‌నగర్ ఫ్లై ఓవర్‌పై నుంచి కిందపడ్డ కారు

## ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృతి

సంగారెడ్డి,ఫిబ్రవరి18(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని గుమ్మిడిదల మండలం అన్నారం గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మృతులు సందీప్, మహిపాల్, పల్లవ్ కుమార్ లుగా గుర్తించారు. వీరు అన్నారం కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నారు. మృతుల్లో ఇద్దరిది అన్నారం గ్రామం కాగా, మరొకరిది సురారం గ్రామంగా గుర్తించారు. ఘటన తెలియడంతో కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. తమ పిల్లలు మరణించారని తెలుసుకుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు శవాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


రసవాహిని
నాగారం..హైదరాబాద్ 500 083
ఆహ్వానం
మాసవారీ ఆత్మీయ సమ్మేళనం...
తేదీ 23.02.2020
సమయం సాయంత్రం 3.45
వేదిక ...3-7/2 శివ శక్తి సాయి కాలనీ
నాగారం...హైదరాబాద్
సభాధ్యక్షులు ...శ్రీ బైసా దేవదాసు సంపాదకులు, నేటినిజం
సభాసంచాలనం... శ్రీ సాధన నరసింహాచార్య
ప్రసంగం...డాక్టర్ ఆచార్య ఫణీంద్ర
అంశం ...దాశరధి కవిత్వం
అనంతరం..కవిగాయక సమ్మేళనం...
అందరికి సాదర ఆహ్వానం

డాక్టర్ రాధశ్రీ

**నమ్మలేని నిజాలు**

ర్యాంకుల కాలం
పరీక్షలే సమస్తం
పనికి చోటు

బాల్య వివాహం
ఎగరలేని పక్షి
జీవితం ఖైదు

కరోన కాటు
మానవాళికి చేటు
వేయాలి వేటు

పేద పేదనే
డబ్బు పల్ల మెరుగు
తోక బెత్తెడు.

మూడు ముక్కలు
జవాబు లేని ప్రశ్న
ఆంధ్రుల రాజ్యం.



- రేడియమ్
9291527757

**శ్రీనిజాలు**

ఢిల్లి లోన కేజ్రీవాల్
వైద్యవిద్యాలె విధానం!
హైద్రాబాద్ కేసీఆర్
ఇచట నీరే ప్రదానం !
నోటిమాట జనం ముందు
నడవ వోయి తమాషాలు!
జోగ్గాదు చేసి చూపిరి
జోడు నగర పాదుషాలు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## దస్తూరి

మనిషిని పోలిన మనిషి
ఉండనట్లే..
చేతిరాతల్లో ఎవరి గీతలు వారివే
వైవిధ్య భరిత సమాహార దస్తూరి
మా తరగతి గది.
చిరునామా పసిగట్టకనే
ఏ పువ్వుది ఏ పరిమళమో చెప్పెయ్యొచ్చు..
చేతిరాత
అంతరంగ సౌందర్యాన్ని ప్రతిబింభిస్తుందట..
ఓ రెండు పంక్తుల చేవ్రాలు నాకివ్వు..
నువ్వేంటో..నీ లోతేంటో చెప్పేస్తానంటారు
కొందరు మానసిక లిపి నిపుణులు
నిజమే..
పొందికైన బుద్ధిదే బంతిపువ్వంటి చేవ్రాలు..

కొందరి పిల్లల వేలి కోసల్లోంచి
ముత్యాలు రాలి పడితే..అదేం విచిత్రమో
మరికొందరెంత వేడుకున్నా బొడిగరాళ్లే.
రాతంటే..
అప్పుడే పుట్టిన బుజ్జిబుజ్జి పజ్జొన్న సొల్లంత
చక్కదనముండాలి..
కలం అలికిన మొలక ల్లోంచే..
రేపటి పంటచేనును
అంచనావెయ్యొచ్చు
అందుకే..
మా పేదపిల్లలకి రాత తర్ఫీదునిస్తుంటా
తలరాతన్నా మార్చుకుంటారని..
అన్నటీనడుమ
రాసే అవసరం కనుమరుగైతోంది.!?
లేఖల పావురాలు ఎక్కడికో ఎగిరిపోయినయి
సాంకేతిక విప్లవం లోంచి ఇంద్రజాలం
శబ్దోచ్చారణ తోనే
రాలిపడుతున్న అక్షరాలు
అవెందుకో..
ఆర్ధ్రత ఉన్నట్లు నాకనిపించదు...
రాత లేని రేపటి సమాజం
కాగితాలనీ కలపనూ..ఆదాచేస్తాయట..
చూడాలి మరి చోద్యం..
సుద్దముక్కను ఆరోవేలుగ ధరించిన
మా నాన్న చేతి రాతకు
ముద్రాక్షరాలు చిన్నబోయేవి.
వారసత్వంగా వచ్చిచేరిన ఈ దస్తూరి అంటే
నాకు పంచప్రాణం..



-నాంపల్లి సుజాత
.9848059893

## భయాలను తరుముదాం

భయం శత్రువు
మన గమ్యం వైపు
మనతోనే నడిచి
వెనుకకు పడవేస్తుంది
మనలో విజయాన్నీ
సంతోషాన్నీ అణచి వేస్తుంది
భయం స్వేచ్ఛను చంపుతుంది
వణికిస్తది
ఆనందిస్తది
శాడిస్టులా రాజ్యమేల్తది
బతక నీయదు
పెనుభూతం అవుతది
తోలుబొమ్మ చేసి ఆడిస్తది
భయానికి మందు లేదు
భయాన్ని తరుముదాం!
నీనించి నానించి దేశం నించి
ఎక్కడ అభయం ఉందో
ఎక్కడ స్వేచ్ఛ ఉందో
ఎక్కడ నిర్భయం ఉందో
అక్కడ మనముందాం!!



-బెల్లం కొండ శ్రీ వరుణ

## మనసు భందం

ఒక చూపు
కొన్ని బంధాలను కలుపుతుంది
మనసుకు తోడుగా
ఒక నవ్వు
మనసు లోని ఆత్మీయత తట్టి లేపుతుంది
ఒక పలకరింపు
యుగాల మౌనం మాయం చేసి
మోడు వారిన మనసు మరల చివురించేలా
ఎన్నో వసంతాలు దరి చేరుస్తుంది



-కవిత రాయల
8886066444

## తల్లి భాష నేర్చుకో....!!

తల్లి భాష నేర్చుకో....
సంస్కారం పెంచుకో...
ఎన్ని భాషలు అయినా పంచుకో...
మాతృభాషలో జీవించు..
నడిపించేది తల్లి భాష అని తెలుసుకో...
కాలము మారిన ఆంగ్లము వచ్చిన
ఆది నుంచి కాపాడేది
అమ్మ భాషే....
ఆంగ్లాన్ని నీ కాటుకలా వాడుకో...
తెలుగును అందంగా చూసుకో...
ఆచరించి పలికిన ఆత్మజ్ఞానము పొందే..
ఖండాంతరాలు దాటిన
కన్నతల్లిని ఎప్పుడు మరవకు...
పరభాషలో ఎన్ని నేర్చిన...
పరతత్వము పొందేది మాతృభాష...
అడుగడుగునా అమ్మనే కనిపించు...
నీకు ఎప్పుడు విజయాన్ని చేకూర్చు...
ప్రపంచాన్ని ఏలేది ఆంగ్లమే...
కాదనలేని సత్యమే...
అది నీ నీడని మర్చిపోకు...
నీవు మాతృభాషలో ఎంత ఎదిగితే..
ఆంగ్లములో రాణి ఇస్తావు అని తెలుసుకో...
జంఘాల శాస్త్రి వారి ఉపన్యాసం గుర్తు తెచ్చుకో...
తెలుగు వాడివి అయినందుకు గర్వించు..
మాతృభాష తెలుగు అయినందుకు
ఎన్నో జన్మల పుణ్యం అని గుర్తించు...
ఏ దేశం వెళ్లిన
నీ దేశం నీ భాష మరువకు...
జై తెలుగుతల్లి జై భారత్ మాత...



-కొప్పుల ప్రసాద్
9885066235

## ఇప్పుడంతా!

ఇప్పుడంతా
ముడుచుకుపోవటమేగా

ఎవరి గదుల్లో వాళ్లు
ఓ మూల చూసుకుని
కలల బూజు దారాలకు
వేలాడుతూ వుండటమేగా

ఎవరి ప్రపంచాల్లో వాళ్లు
దూరిపోయి
మాటల క్షణాలను మట్టుబెడుతూ
మౌనంగా గడ్డకట్టుకుపోవటమేగా

చీకటి గుహలో పడివుండటమో
కుక్కలా చుట్టూ తిరిగి
జానెడు జాగలో
నిశ్శబ్దంగా ముందుకాళ్ల మీద
మెడను జారేసి
రంగుల గాజు పలకల్లోకి
తదేకంగా చూస్తూ గడపటమో

మునిగిపోతున్న ఇళ్లను
పగిలిపోతున్న మనుషులను
చెదిరిపోతున్న బంధాలను
రాలిపోతున్న పూల మొగ్గలను
తరలిపోతున్న వసంతాలను
ఏమీపట్టనట్టు
చూస్తూ గడపటమేగా

ఎవరిమానాన వాళ్లు
ఇరుకయిన మురికి కాలవల్లో
భారంగా ఈదటమో
మనుషులుగా చస్తూ
వస్తువులుగా జీవించటమో
చేస్తున్నదేగా

ఎవరి గాయాలను
వాళ్లే నాక్కుంటూ
ఎవరి బాధలను వాళ్లే
ఎత్తిపోసుకుంటూ
ఏదో బతుకుతున్నామని
అనిపించుకోవటమేగా

నేలను ముద్దాడే సందర్భాలెక్కడివి
ఆకాశాన్ని చూసి ఆనందంగా
ముచ్చటించుకునే సమయాలెక్కడివి

వెన్నెల గొడుగు కింద
మట్టి తివాచీ పైన
మనుషులంతా
సామూహికంగా కూర్చుని
కొన్ని నక్షత్రాలనూ
ఒక జాబిలి పువ్వును
మాటల మరువంతో కలిపి
మానవ సంబంధాల మాలల్ని
ప్రేమగా అల్లుకునే తీరికలెక్కడివీ

మనుషులంతా
ఎవరి కలుగుల్లోకి వాళ్లు
చడీ చప్పుడు కాకుండా దూరిపోయి
ఎవడి బతుకు బురదలో వాడు
కొట్టుకుపోవటమేగా
ఇప్పుడంతా
ముడుచుకుపోవటమేగా!



- చిత్తలూరి సత్యనారాయణ
8247432521

# సాహితీయోధుడు 'ద్వానా'

ద్వానా శాస్త్రిగా ప్రసిద్ధి పొందిన దివంగత ద్వాదశి నాగేశ్వరశాస్త్రి తెలుగు భాష, సాహిత్యాల వికాసం, ఔన్నత్యానికి అవిశ్రాంతంగా కృషి చేసిన సాహితీ యోధుడని అతిథులు కీర్తించారు. తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ సౌజన్యంతో శని వారం కళాలలిత కలావేదికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ద్వానా శాస్త్రి రచించిన 'సాహిత్య తెలంగాణ' గ్రంథాన్ని తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్వానా శాస్త్రి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. డా॥గోపి మాట్లాడుతూ ద్వానా శాస్త్రి సాహిత్య రచనా వ్యాసంగాన్ని తన యాస, శ్వాస, ధ్యాసగా సంభావించి అవిరళ కృషి చేశారన్నారు. 2005లో అమలాపురం నుంచి నగరానికి వచ్చిన ద్వానాకు లోహజంతువులాంటి నగరంలో సంక్లిష్టమైన నగరంలో ఎలా ఎదగాలో సూచనలు తాను ఇచ్చినట్లు డా॥ఎన్.గోపి పేర్కొన్నారు. వక్తృత్వం, స్వీయ సాహిత్య ప్రతిభే ద్వానాను అన్నింటా ప్రథముడిని చేసిందని, సహజంగా ఉన్న శక్తిని కూడా అధిగమించేలా చేసిందని, 50 యేండ్లు శ్రమిస్తేగాని రాని కీర్తి 15 యేండ్లలోనే సాధ్యమవడానికి ద్వానా చేసిన నిరంతర శ్రమ, సాహితీ కృషే కారణమన్నారు. తక్కువ సమయంలోనే 78 విలువైన సాహితీ పుస్తకాలను ద్వానా వెలువరించడం అద్భుతమని గోపి అన్నారు. నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు సభాధ్యక్షత వహించారు. అతిథులుగా ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, జయ జయ శంకర్ టీవీ ఛానల్ సీఈవో డా॥ఓలేటి పార్వతీశం, కిన్నెర ఆర్ట్ థియేటర్ ప్రధాన కార్యదర్శి మద్దాళి రఘురాం, కవి రమణ వెలమకన్ని, తెలుగు భాషా చైతన్య సమితి సంపాదకుడు డా॥జయప్రకాశ్, ద్వా.నా.శాస్త్రి కుమారుడు శశికాంత్ ద్వానాపై కవితను వినిపించారు. నిర్వహణ సంస్థ స్థాపక అధ్యక్షుడు బదేసాబ్ ఆహ్వానం పలికారు. ద్వా.నా. శాస్త్రి మనవరాలు వైష్ణవి లహరి ప్రార్థనా గీతంతో సభ ప్రారంభమైంది. సంస్థ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు వందన సమర్పణ చేశారు.





'ద్వానా' చిత్రపటానికి నివాళులు తెలుపుతున్న బదేసాబ్, డా॥జయప్రకాశ్, బైస దేవదాసు, కిన్నెర రఘురాం, ఆచార్య వెల్దండ నిత్యానందరావు, వైష్ణవి లహరి, ఆచార్య ఎన్.గోపి, డా॥ఓలేటి పార్వతీశం, రమణ వెలమకన్ని, శశికాంత్.





ద్వానా శాస్త్రి రచించిన "సాహిత్య తెలంగాణ" గ్రంథావిష్కరణలో అతిథులు.

పుస్తక సమీక్ష

## తెలంగాణ ఉద్యమ నాయకుడు

# శ్రీధర కవితా ప్రస్థానం

1969 లో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థిగా ఉంటూ, తెలంగాణ ఉద్యమ నాయకుండిగా సుప్రసిద్ధుడు డా॥ శ్రీధర్ రెడ్డి గారు.

శ్రీధర్ రెడ్డి గారు మొదట వ్యాస సంకలనం "ప్రతిధ్వని" తరువాత "మరో ఉదయం" అనే అద్భుతమైన నవల, తరువాత "నాకుల మేది' అనే నవల, ఇపుడు 147 కవితలతో "శ్రీధర కవితా ప్రస్థానం' అనే కవితల సంపుటితో సాహిత్య లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు.

శ్రీధర్ రెడ్డి గారి వ్యక్తిత్వం విశిష్టమైంది. గొప్ప ఆత్మవిశ్వాసం వారి ఊపిరి. మనసులో మాట చెప్పటానికి ఏ విధంగానూ వెనకాడకపోవటం, నిర్భయం గా అనటం, సమాజంలో, ప్రభుత్వంలో వుండే లోపాలను ఎత్తి చూపటం వీరి కవితల్లో కనిపించే జీవ లక్షణం.

శ్రీధర్ రెడ్డి గారి కవితలు చదువుతుంటే అలనాటి పోతన, దూర్జటి గుర్తుకొస్తారు. ఇక్కడ భక్తి కాదు అంశం, ధిక్కార స్వరం వినిపించడం, పోతన "ఇమ్మనజేశ్వరాధర ములు" అని అనటం, దూర్జటి రాజుల్మతులు, వానిరి సేవ నరకప్రాయ ము" అనటం గమనిస్తే ఎవరికీ తలవంచని మహాకువుల విలక్షణమైన సాహిత్య వ్యక్తిత్వం శ్రీధర్ రెడ్డి లోనూ కనిపిస్తుంది ఈ కవితల్లో..

**'ఎవడు పడితే వాడు నాయకుడవుతాడా" అని ప్రశ్నించి ఎవడు తగినవాడో చెప్తారు**

**"గాడిద పులిచర్మం కప్పుకుంటే పులి అవుతుందా**

**సారా తాగుతూ నోట్లు పంచుతున్నావా/ఎంతకాలం మంత్రిగా వున్నావన్నది కాదు**

**ఎంత నీతిగా బతికామన్నది తెలుసా/**





**ఎవడు పడితే వాడు నాయకుడవుతాడా॥"**

ప్రతివాడు నాయకుడు కాదని, నీతి మంతుడే నాయకుడని నిర్వచించారు స్పష్టంగా....

శ్రీధర్ రెడ్డి గారు కవితల్లో అధిక్షేపాత్మకత చూస్తుంటే వేమన స్ఫురిస్తాడు.

"ఎంకమ్మ మెలోడ్రామా" ఎంకమ్మ లాంటి లాంటి వాళ్ళు పంపు నీళ్ళ దగ్గర, కూరగాయల మార్కెట్లోనూ కొట్లాడుకోవటం చూస్తుంటాము. ఇక్కడ ఎంకమ్మ చీరకుచ్చిళ్ళు పైకి దోపి తొడకొట్టి ఎవడొస్తాడో రండి, కాళ్ళు విరక్కొడతా, చేతులు నరుకుతా, మీ బండారం బయటపెడతా అని అరుస్తోంది. ఆమె నోటిని ఎవరూ ఆపలేరు. ఒక పెద్దమనిషి కల్పించుకుని సర్ది చెప్పాడు. ఇందులో విశేషమేముందీ అంటే , శ్రీధర్ రెడ్డి గారి కవితాత్మ లోతైంది. అధిక్షేపంలో ఉంది. "అసెంబ్లీ జ్ఞాపకం వచ్చింది నాకు, అసెంబ్లీలో జరిగే దుర్యోదన దృశ్య కావ్యముల కాలమిది " అంటారు.

మనకి మారని అమెరికా కావ్య మోహం గురించి వాస్తవ చిత్రీకరణ "మావాడు అమెరికా వెళ్ళాడు" అనే కవిత .. తల్లితండ్రులందరూ అమెరికాలో ఉన్నారని, మా అల్లుడు అమెరికాలో

ఉన్నాడని గొప్పలు చెప్పుకు మురిసిపోతున్నాం గదా! అమెరికా అబ్బాయి నిజంగా హాయిగా, గొప్పగా ఉన్నాడా? లేదు అంటారు కవి. కూలినాలి చేసి నాలుగు గింజలు పట్టుకొచ్చేవాడు, పొద్దున్నే చద్దన్నం తిని పనికి పోయేవాడు అని చెబుతూ "అక్కడా చద్దన్నమే తింటున్నాడు. ఫ్రిజ్‌లో పెట్టుకుని వారం రోజులు అదే తింటున్నాడుగా, చివరిలో పాపం మా వాడు అమెరికా వెళ్లాడు" అంటారు. అక్కడ కెళ్ళిన కొందు పిల్లలు బేబీ సిట్టింగ్ చేసి, హోటల్లో ప్లేట్లు కడిగి, పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోసి, ఇలా నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నారు. అయినా ఇక్కడ అమ్మలు, నాన్నలు అమెరికా వెళ్ళారని గర్వపడుతుంటారు పాపం ॥ కార్పొరేట్ కాలేజీ లో చదువు గురించి చెబుతూ "ఎక్కాలు రానివాడు లెక్కల మాస్టరయ్యాడని' నిజాన్ని నిక్కచ్చిగా చెప్తారు కవి. ఓ సామెతలా వినిపిస్తోంది..

భారతీయ సంస్కృతిలో కారణ జన్ములను గౌరవించడం వుంది. ఎవరూ కారణ జన్ములు అంటే రామకృష్ణ పరమహంస, శంకరాచార్యులు, వివేకానం దుడు అని, వారి జన్మ వలన లోకానికి మేలు జరుగుతుందని భావించి వారి ఉపదేశాలు ఆచరించాలనుకుంటాం. నేడు కారణజన్ములున్నారంటారు శ్రీధరరెడ్డి గారు వారెక్కడ నుంచి పుట్టుకొచ్చారంటే భట్రాజుల పొగడ్తలనుంచి, జన్మదిన శుభాకాంక్షలనుంచి, మోసం చేసే బాబాల నుంచి, నల్లదనంలోంచి, ఆ పార్టీ నుండి ఈ పార్టీకి, అక్కడ ఇక్కడ మంత్రి అయితే కారణజన్ముడవుతాడు అని, బాబాలు, పీఠాధిపతులు, తారలు, నాయకులు అందరూ నేను కారణ జన్ములే – కారణ జన్ములకు మనకు కొదవే లేదు ॥

శ్రీధర రెడ్డి గారు కవితా ప్రస్థానం లో వారి నిజాయితీ కనిపిస్తుంది

**" ఓట్లకు నోట్లంట/ నోట్లకు ఓట్లంట/ ఆ పార్టీ ఈ పార్టీ/ కాక్‌టైల్ పార్టీలో/ కండువాల మార్పంట/ ఏ మడిలో కడితేనేం / మన దొడ్డిలో ఈనితే చాలంట/ ప్రజాస్వామ్యం ముసుగులో / ధనస్వామ్యమట"** ఇలా శ్రీధర్ రెడ్డి గారి కవితల్లో వాస్తవికత అద్దం పడుతుంది. నిజయితీ తలెత్తుతుంది.

సాధారణంగా ఒక కవితల సంకలనం కానీ, మరే రచన కానీ అంవి కవిత్వాలంటే రాజకీయ నాయకుల్నో, సినిమావాళ్ళనో, వ్యాపార వేత్తనో ఎంచుకుంటారు. కానీ శ్రీధర్ రెడ్డి గారు "కవితా ప్రస్తానాన్ని తల్లి గారికి అంకితమివ్వడం, వారి గొప్ప సంస్కారానికి నిదర్శనం. ఆ తల్లి వ్యవసాయపు పనుల్లో తలమునకలవుతూనే ప్రజా శ్రేయస్సును కోరుతూ, అందరికీ ప్రేమను, ఆప్యాయతల్ని పంచే ఆదర్శ మాతృమూర్తి, ఆత్మ విశ్వాసంతో ఆత్మ గౌరవంతో జీవిత ప్రస్థానాన్ని తనకు అందించిన మాతృమూర్తి అని అంటారు నమస్కరిస్తూ...

శ్రీధర్ రెడ్డి కవితా ప్రస్థానంలో 147 కవితలున్నాయి. నేను చెప్పినవి ఉదాహరణలు మాత్రమే.

ప్రతులకు: శ్రీధర్ రెడ్డి, నవోదయ బుక్ హౌస్, దిశ పుస్తక కేంద్రం చిక్కడపల్లి, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు



-ముక్తేవి భారతి
సెల్: 9989640324

## ఇప్పుడు

వర్తమాన పల్లకీని మోస్తున్న
బోయీవి నీవు!
'ఇప్పుడు' అనేది నిజం
ఇదే మనది.. ఇది మాత్రమే మనది!
గడిచింది..
విడిచి వెళ్ళింది.. మనది కానిది!
గడవాల్సింది..
మనదో కాదో తెలియనిది!
ఈ క్షణాలే నీవి
అందుకే..
'ఇప్పుడు' లో నివసించు
చెయ్యాల్సినవన్నీ చేసేయ్.. వాయిదా వేయకు
చేస్తూ ఆనందించు.. అనుభవించు!
రేపటి గమ్యం మిథ్య
ఎదురు చూడకు!
భయాన్ని నినదించు.. భ్రమను వీడు!



–ఆచార్య కడారు వీరారెడ్డి
సెల్: 9392447007

## మణిపూసలు

చదువును చదివిన వెలుగులు
మనిషికి జ్ఞానపు జిలుగులు
చీకటిని తరిమి కొట్టి
వెదజల్లును నవకాంతులు

విద్యలు నేర్చిన వచ్చును
బుద్ధులు అన్నియు హెచ్చును
విశ్వంబున జరుగు వింత
లన్నియు నీకే తెలుసును

కులమున ఏమున్నది
మతమున ఏమున్నది
ఇద్దరికి హితమైతే
హద్దులు లేవన్నది

గాలికి కులమున్నను
నేలకు కులమున్నను
జీవులంటు ఉండునా
ప్రేమకు కులమున్నను

తాగిన వాగుడు ఎక్కువ
బందువులందున తక్కువ
ఇల్లే గుల్లయినను
మత్తే మనిషికి మక్కువ

ఏరువాక సాగిన
ఎవుసమంత నడిచిన
రైతుయెంత మురుసునో
పైరు పంట పండిన.

– అన్నల్‌దాస్ రాములు
సెల్: 9949553655

## సమాజాభివృద్ధి

సమాజం ఒక దేవాలయం
పలు రకాల వ్యక్తిత్వాలు గల
వ్యక్తుల సమూహమే సమాజం
అందులో నువ్వూ,నేను, మనం
అందరమూ భాగస్వాములమే
సమాజాభివృద్ధి కోసం
అమూల్యమైన నీ సేవలనందించు
విద్యాలయమే దేవాలయమని
అ,ఆ,ఇ,ఈ నేర్వమని
చదువులోని పరమార్థాన్ని విశదీకరించి
బాల కార్మికులను బడిలో చేర్చి
పనికన్నా బడిమిన్నని
బాల్యం పిల్లల వరమని
సమాజాభివృద్ధికై పాటుబడు
కులమత భేదాలు వలదని
ఐకమత్యంతో మెలగమని
సమసమాజాన్ని నిర్మించు
మిన్నంటే ధరలతో సతమతమవుతున్న
సగటు మనిషికన్నీటిని తడిచే యత్నంలో
నీ వంతు కృషితో
నిత్యావసరాల ధరలను
తగ్గించే యత్నం చేయు.
ప్రాణాంతకమైన 'కరోనా' వైరస్‌కు
నివారణ ఒక్కటే మార్గమని
దేశ నలుదిశలా ఎలుగెత్తి చాటు..



–రాయవరపు సరస్వతి
9885656356

# సునందన వనంలో విహరింప చేసిన కథలు

మనిషి అనుక్షణం, సంఘటనల సముద్రంలో ఈదులాడుతుంటాడు. సామాన్యులు ఆ సంగటనలకు అంతగా ప్రాముఖ్యత ఇవ్వరు. రాబోయే సంఘటనల్ని ఎదుర్కొవటానికి తమను తాము సమాయత్త పరుచుకుంటారు తప్ప.

ఒక కవి, కథకుడు, ఆ సంఘటనల్ని మదిలో పదిలపరుచుకుని, వాటి చుట్టూ ఆసక్తికరమైన కల్పనలను జోడిస్తాడు. శ్రీమతి వురిమళ్ళ సునంద (భోగోజు)గారు వృత్తిరిత్యా ఆధ్యాపకురాలు. శ్రోతలను ఎలా ఆకట్టుకోవాలో తెలుసు. అంతేకాకుండా, రోజూ వినే పాఠాలే అయినా, ఏ రోజుకా రోజు నవ్యతను రంగరించి విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించి ఆకట్టుకోవటం తెలుసు. అందుకే సునందగారి ఈ కథా సంకలనానికి రాసిన ముందు మాటలో ప్రముఖ కవి, రచయిత శ్రీ విహారిగారు వీరి గ్రహణశక్తి, స్వీకరణ చిత్తశుద్ధికి అబ్బురపడ్డారు. వీరిని ఉన్నతశ్రేణి కథకురాలుగా ప్రశంసించారు.

సంకలనంలోని 21 కథల్లో వస్తు వైవిధ్యం, వస్తు విస్తృతి, చాలా విస్తారంగా కనిపిస్తుంది. ఒకప్పటి పావలా అర్థ రూపాయి నాణేలు ఇప్పుడు చలామణిలోంచి నిష్క్రమించి 'చెల్లని రూపాయి'ల య్యాయి. ప్రపంచ మార్కెటులో రూపాయి విలువ ఎప్పుడైతే పడిపోయిందో అప్పటి నుండి ఇక్కడ (భారత దేశంలో) పావలాలు చెల్లకుండా అయిపోయాయి (పావలా తాత' కథ) అంటూ మొన్నటి తరం తాతయ్యకు నేటితరం మనవడితో చెప్పించారు. అంతర్జాతీయ మారకం (International trade) ద్రవ్యోల్బణం లాంటి క్లిష్టమైన ఆర్థిక విషయాలను 'Made easy' చేసి చెప్పారు సునందగారు.

నిప్పుల కొలిమిలాంటి ఎండ, బస్సుకోసం ఎదిరిచూపులు రెండు మూడుబస్సులకు సరిపడేంత మంది ప్రయాణీకులు. బస్సురాగానే త్రోపులాట తడిసి ముద్దవుతున్న బస్సులోని జనం. ఇదే అదను అనుకుంటూ తమ 'వెకిలి తనాన్ని' ప్రదర్శించే తోటి ప్రయాణీకుల బారి నుండి గిల్టునగలు అమ్ముకునే






తల్లి మంగవ్వ, కూతురు రంగమ్మలు తమను తాము ఎలా రక్షించుకున్నారో తెలుసుకోవాలంటే 'పూనకం' కథ చదవాల్సిందే!

పోపుల డబ్బాలు బట్టల మడతలు లాంటివి గృహిణుల సేవింగ్స్ బ్యాంకులు, పదీ పాతికా దాచుకుని అవసరం కొద్ది వాడుకుంటారు. సాధారణ మధ్య తరగతి యువతులు. వయసు చెల్లినవారు. అలా దాచుకున్న సావిత్రమ్మ ఈ మధ్య చాలా దిగులుగా ఉంటోంది. ఆమెలో ఉత్సాహం చలాకీతనం మచ్చుకైనా కనబడటం లేదు. నిరానక్తత వరధ్యానం ఆవెను అలుముకుంది. రోజూ ఇల్లంతా వెదకటం, చివరను దిగులు పడటం, భర్త ఎదురుపడగానే చిరునవ్వు బలవంతాన పులుముకోవటం సావిత్రమ్మను గమనిస్తోన్న ఆమె భర్తకూ, కోడలికీ అంతుపట్టడం లేదు. ఇలా నాలుగు పేజీల 'దూరం' పాటకులూ సావిత్రమ్మతో బాటు దిగులుపడతారు. చివరి పేజీలో అసలు విషయం తెలిసి (చదివి) ఆమెతోబాటు పాఠకులు కూడా తేలికపడిన మనసులతో "హమ్మయ్య!" అంటూ విశ్వసిస్తారు 'పాతచీర" కథ చదివి. అంతే కాదు, ఆమె తప్పిదం.

ఆ పాత చీర తీసుకున్న పనిమనిషి రంగమ్మ జీవితానికి ఎలా ఓ దారి చూపిందో, ఊహించని ట్విస్టుకు 'కొసమెరుపు'కు పాఠకులు 'ఫిదా' అవుతారు.

ఒకరి 'బుర్ఖా' సాంప్రదాయం, మరొకరికి రక్షణ ఇస్తుందా? అవును. ఇస్తుంది. ఎలా ఇచ్చిందో తెలుసుకోవాలంటే రచయిత్రి రాసిన 'ముసుగు' కద చదవాల్సిందే!

కదిలించే కథలు, చిత్ర జీవన గతుల సమాహారమే ఈ బహు'మతులు' కదా సంకలనం. పైపెచ్చు ఇవన్నీ లోగడ వలు పత్రికల్లో ప్రచురింపబడి ప్రశంసలందుకున్నవే కావటం విశేషం. చక్కని పరిశీలన అవగాహనతో రాసిన కదలివి. పాఠకుల మన్ననలను తప్పక స్వంతం చేసుకోగలిగే కథలివి.

**ప్రతులకు:** భోగోజు ఉపేందర్‌రావు
ఇ.నెం. 11-10-694/5,
బురహాన్‌పురం, ఖమ్మం. వెల: 150/-
సెల్: 9441815722,
9494773969



– కూర చిదంబరం
సెల్: 8639338675

పుస్తక సమీక్షలు

## లోకోక్తులు

ఆశలు లేనివారు
జగమునందు కనుపించరు.

జగమంతా మిథ్య అనువారు
అస్తిత్వంపై విశ్వాసం లేనివారు.

సంతులేని వారంతా
అంతోషులు కారు.

తల్లిదండ్రుల కోల్పోయినవారు
లోకం అండకలిగిన వారు.

దిక్కులేదని తోచినవారే
దేవుని అండకోరువారు.

తల్లిదండ్రులను గౌరవించని వారు
సమాజానికి చేటుచేయువారు

ఆచార్యులకు ఆదరించనివారు
అందరికీ అలుసైపోతారు.

అతిథి అభ్యాగతులను స్వాగతించనివారు
ఆదరమిసుమంత పొందజాలనివారు.

అత్యాశలు లేనివారు
చింతలు లేనివారు.

రాగద్వేష రహితులు
దుఃఖ రహితులు.

డబ్బులేనివారందరూ
సుఖహీనులు కారు.

అమీరులందరూ
అత్యాశకు అర్రులు చాచువారు.

హాస్యానికి స్పందించనివారు
నగుబాటుకు లోనవుతారు.

కేవలం దేవతలను నమ్మువారు
జీవితంలో జయమొందనివారు.

పరులను పీడించనివారు
నేడు గొప్పనేతలు కాజాలరు.

మాటదప్పిన వారు
తాత్కాలికంగా చలామణి అయ్యేవారు.

మాటకు కట్టుబడి ఉందువారు
శాశ్వత యశస్సు గడించువారు.



–అమర్ జీ
సెల్:9620186222

## మధురవాణి

అమ్మ లేకపోతే అసలు జాతిలేదు
చావు లేదు చాకిరేవు లేదు
పుడమి మీద మనిషి కెప్పుడు
పుట్టుక అన్నది లేదు రాబోదు

ఆమెకు తెగువ లేక కాదు
చేవచచ్చి కాదు చేతకాక కాదు
ఆమె భుజం తట్టినప్పుడు పొంగగలదు
ఊతం ఇచ్చినప్పుడు ఉద్యమించ గలదు

సహనం నందు సాటెవరు ఆమెకు
సరి సమానమెవరు సాహసం నందున
తెగువ యందు మగువ కెవరు
సాటి కదా ఈ జగమున

తెలివి తేటలందు తేజస్సు నందును
తిరుగులేని గొప్ప తెగువ యందును
ఆమెకన్న ఘనులు అవనిలో ఎవ్వరు
ఓర్పు సహనంలో ఆమెయే ముందును

పలుక నీయబోరు బడికి పంపగబోరు
నీతి పాఠంలను అసలు నేర్పనీయరు
ఆడది అంటే అలుసాయే వీరికి
ఆడదంటే ఆదిశక్తిని తెలుసు కోరు

–మామిడి రమేష్
93964074210

# తెలుగులో... ఉర్దూకవి ఫైజ్ కవిత్వ దర్శనం...!

ఉర్దూ సాహిత్య దిగ్గజంగా భాసిల్లిన కవి ఫ్రైజ్ అహమద్ ఫైజ్ 1911 నుండి 1984 వరకు తమ రచనలతో.. సామాజిక చైతన్యానికి పాటుపడ్డారు. కులీన కుటుంబ ంలోంచి ఆయన వచ్చినప్పటికీ.. అతనికి విప్లవ ముద్ర ఉండేది. ఆయన కలం మరియు గళంతో అందరినీ ఇట్టే ఆకట్టుకునే వారు! ఇప్పటి పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్‌లో జన్మించిన ఆయన 1930లో ఆలిండియా రేడియో స్థాపించ బడిన పిదప ప్రజా జీవితంలో రేడియోకు విశేష ఆదరణ లభిస్తున్న కాలంలో ఫ్రైజ్ ఎక్కువ ప్రభావితుడై.. సంగీతానికి అనుగుణంగా గీతాలు రాసే వాడు. ఉర్దూ భాషలో మాతృభూమి కోసం.. దేశభక్తితో.. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఎంతో కవిత్వం వచ్చింది. అయితే ఫైజ్ దీనికి కొంత భిన్నంగా దారిద్ర్యానికి పెట్టుబడిదారీ విధానానికి కవిత్వం రాయడం ఆరంభిం చాడు. ఫైజ్ ముస్లిం కమ్యునల్ వివాదాలు ప్రక్కకు త్రోసేసి రాజకీయ సామాజిక దోపిడీకి వ్యతిరేకంగా కవిత్వం రాసేవాడు. 1939 ప్రాంతంలో ఫైజ్ ఉర్దూ సాహిత్యంలో గొప్ప కవిగా పేరు సంపాదించాడు. వామ పక్షభావాలు.. ప్రగతిశీల భావాలు.. అభ్యుదయ భావాలు పుష్కలంగా కలిగి వున్నారు. 1947లో మనం స్వాతంత్ర్యం సముపార్జించినప్పటికీ.. భారత్.. పాక్‌లుగా విభజింపబడటం పట్ల ఆయన తృప్తి చెందలేదు. 1947లో లాహోర్‌లో ఓ రెండు ప్రముఖ దినపత్రికలకు సంపాదకులుగా పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. 1951లో రావల్పిండి కుట్ర కేసులో నిందితుడిగా అరెస్టయి మూడు నెలల కారాగారవాసం అనుభవించారు. అప్పటి నుంచి కవిత్వం రాయడంలో ఎక్కువ మక్కువ చూపేవాడు. ఆ క్రమంలోనే ఆయన జీవితకాలంలో 8 సంపుటాల కవిత్వాన్ని ప్రచురించినాడు. ఆయన రాసిన కవిత్వానికి విశ్వ వ్యాప్తంగా ఆదరణ లభించింది. ఆయన కవిత్వం ఆంగ్లంలోకి అనువదింపబడింది. 20వ శతాబ్ది కవిగా ఆయన ఆదరింపబడి అభినందనలు అందుకున్నాడు. సుప్రసిద్ధకవులు ఆంగ్లంలోకి అనువదించినందువల్ల.. ప్రపంచ భాషల్లోకి ఆయన కవిత్వం వెళ్లిపోయింది. ఇంకేముంది? ఆయన కవిత్వం మన భారతీయ భాషల్లోకి అనువాదం చేయబడింది. ఈ క్రమంలోనే ఫైజ్ కవిత్వాన్ని ఆంగ్లంలోకి కొంతమంది తీసుకొచ్చారు. వాటిలోని కొన్ని కవితల్ని మన తెలుగు సాహిత్యంలో ప్రముఖ, కవి, రచయిత విమర్శకునిగా వెలుగొందుతున్న శ్రీ జంజం సత్యనారాయణగారు ఫైజ్ కవిత్వంలోని కొన్ని కవితల్ని ఎంపిక చేసి తెలుగులోకి అనువదిస్తూ "ఫైజ్ కవిత్వం" పేరుతో ఓ గ్రంథాన్ని ప్రకటించారు. వి.జి. కిర్నన్, నామిలాజార్ద్, శివ్ కె. కుమార్, ఖాలీద్ హమీద్ షయిదా ఎండి. మరియు బరాన్ ఫారూఖీలు ఆంగ్లంలోకి తెచ్చిన ఫైజ్ కవిత్వాన్ని జంజం సత్యనారాయణగారు తెలుగులోనికి అనువదించి 'ఫైజ్ కవిత్వం' పేరుతో వెలువరించినారు. ఈ గ్రంథంలో జంజం సత్యనారాయణగారు ఫైజ్ కవిత్వం యొక్క మూలం దెబ్బతినకుండా తెలుగులోకి అనుశీలనం చేశారు. ఫైజ్ యొక్క ఆంగ్ల అనువాద కవితల్ని వాటితోపాటు వాటిక్రింద తెలుగులోకి అనువదించిన కవితల్ని పొందుపరిచి తెలుగు పాఠకులు ఫైజ్ కవిత్వాన్ని ఆస్వాదించే అవకాశం కల్పించారు. ఫైజ్ కవిత్వం పరకాయ ప్రవేశం చేసి.. మూల రచయిత నాడీ పట్టుకుని.. తెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం. లోగడ జంజం సత్యనారాయణగారు కబీరు.. జయశంకర ప్రసాద్ వాజ్‌పేయి కవిత్వాన్ని తెలుగులోకి తెచ్చి అందరినీ మెప్పించారు. ఇప్పుడు ఫైజ్ కవిత్వాన్ని మనకు తెలుగులో అందిస్తున్నారు. ఫైజ్ కవిత్వాన్ని వి.జి. కిర్నన్ రాసిన ఆంగ్ల భాష నుండి జంజంగారు తెలుగులోకి అనువదించిన కొన్ని కవితల్ని పరిశీలిద్దాం. 'ఈ రాత్రి' పేరుతో అనువదిం పబడిన కవితలో.. ఈ రాత్రి మానస వీణ తీగెల్ని మీటి శ్రుతితో బాధించకు వేదనా భరితమైన రోజులన్నీ పూర్తిగా గడిచిపోయాయి.

రేపటి వార్త లేమిటో ఎవరికి మాత్రం ఏం తెలుసు? అని ప్రశ్నిస్తూ కొనసాగించిన కవితలో అనువాదకులు జంజంగారు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ చక్కగా తెలుగులోకి అనుశీలనం చేశారు.

'కవితా వస్తువు' శీర్షిక పేరుతో తెలుగులోకి అనువదించిన ఫైజ్ కవితలో...

అసుర సంధ్య వేడిగా వున్నా నెమ్మదిగా చల్లబడుతోంది చంద్రుని వెన్నెల కాంతిలో యామినీ స్నానమాడించి అంటారు.

అంతటితో ఆగక..

ఇప్పుడు కళ్లు మదిలోని ఏదో భావనకై ప్రతీక్షిస్తున్నాయి!" అంటూ కొనసాగించడం బాగుంది.




"ఆమె వ్రేళ్ళు" శీర్షికతో రాసిన కవితలో..

**"ఈ ఉదయం చల్లగాలిలో ఆమె చేతి వ్రేళ్లు**
**ఎంత స్నిగ్ధంగా వున్నాయి..**
**నేనక్కడ తారాడుతూ వుంటే ఈ**
**అద్భుతభావన నా మనస్సులో తళుక్కుమంది"**

అంటారు.

"ఉరికంబం" కవితలో
ఆలోచనాత్మక భావాలను ఆవిష్కరించారు.

**"ఇది ఎలాంటి కాలమంటే**
**ప్రియురాలి అందానికి పరీక్షా సమయం.**
**ఇవి ఉద్విగ్న క్షణాలు**
**మనకత్యంత ప్రియమైన ముఖాన్ని వీక్షించే సమయం**
**ఆందోళన చెందుతున్న హృదయంలో**
**ఇది ఆనందాన్ని కలిగించే ప్రశాంతవేళ"** అంటూ

రాసి

**ఇలాంటి సమయంలో మన మిత్రబృందం**
**వెంట లేకపోతే ఏం బాగుంటుంది?**
**తమాల వృక్షనీడలు నృత్యాలు**
**వాటి తన్మయత్వాన్ని ఈ వేళ మనతో**

పంచుకుంటున్నాయని కొనసాగించడం బాగుంది.

'రెండు ప్రేమలు" కవితలోనూ వైవిధ్యంగా అందమైన భావాలను నిక్షిప్తం చేశారు.

సూర్యబింబం.. చంద్రబింబంను కవితలో ప్రస్తావించిన తీరు ప్రశంసనీయం.

'జైలులో ఒక ఉదయం'... "జైలులో ఒక సాయంత్రం" కవితలు కవి యొక్క సృజనాత్మకతకు అద్దంపట్టే విధంగా ఉన్నాయి.

'ఏమీ అడగకు' కవిత చిన్నదైనప్పటికీ పెద్ద భావాన్నే మోసుకొచ్చింది.

**నీ కోసం ఎప్పట్నించి నిరీక్షిస్తున్నానో నన్నడగకు**
**చాలా రోజుల క్రితం నేను నీ కోసం ఎదరి చూసేవాడిని కాను**
**మనకు తెలియని వసంతాలలో నీ అతిలోక**
**సౌందర్యాల నిండుగా ఉండేది!**
**అవి నీ కౌగిళ్ళు-నీ భుజాలు, నీ పెదాలు కావు"**

అని తెల్చి చెప్పిన తీరు బాగుంది.

ఫైజ్ కవిత్వాన్ని నామిలాజర్ద్ ఆంగ్లంలోకి తెచ్చిన కవితల్ని జంజంగారు తెలుగులోకి అనువదించిన కవితల్లోను ఫైజ్ యొక్క కవిత్వ గొప్పతనాన్ని చూడగలం.

'పరిచయం' శీర్షికతో రాసిన కవితలోని పంక్తులు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి.

**ఏదో ఒకరోజు బహుశ ఈ గీతం**
**హత్య చేయబడుతుంది.**
**అయినా ప్రతిపుటపై దాని రక్తం ప్రవహిస్తుంది**
**అది ఎప్పుడైనా నీకు తెలుస్తుంది.**
**ఏదో ఒక రోజు బహుశ ఈ పాట**
**పతాకం కిందికి జారినా ప్రతీక్షిస్తుంది.**
**ఉన్నత శిఖరాలపై ప్రచండమైన గాలిలో రెపరెపలాడుతూ చూడాలని!**
**ఏదో ఒక రోజు బహుశా రాతి గుండెలనైనా**
**నీ హృదయం చివరి దశలో**
**దాని జీవనాడి నిన్ను గాయపరుస్తుంది.**

పై కవితలో నర్మగర్భంగా కవి గురించి.. కవి కలం నుండి జాలువారే అక్షరం గురించి చెప్పి అందరినీ మెప్పించారు.

'వసంతం వస్తుంది' కవితలో ఆశవహ దృక్పథాన్ని చూడగలం.

**"వసంతం వస్తుంది, చూస్తుండగానే రోజులు గడిచిపోతాయి!**
**యవ్వనం రోజులన్నీ నీ పెదాల పైననే నిదురించాయి**
**అవన్నీ యిప్పుడు చెరసాలలో ప్రతీక్షిస్తూ మళ్ళీ అంకురించాయి."** అంటూ కవితను ఎత్తుకున్న తీరు బాగుంది.

'ఈ రాత్రి ఎవరూ లేరు" కవితలో చక్కని భావుకతను ప్రదర్శించారు.

ఫైజ్ కవిత్వాన్ని శివ్.కె.కుమార్ ఆంగ్లంలోకి అనువదించిన కవితలను కూడా జంజంగారు తెలుగులోకి అనుశీలనం చేశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

'ప్రేయసి జ్ఞాపకంలో' కవితలో ప్రతి పంక్తీ కవితాత్మకంగా మలచబడింది.

**"నాది నాకివ్వు**
**నీ మధురాధరాలు, నీ అమాయకపు నుదురు**
**ఆ అందమైన కళ్ళు**
**మళ్ళీ నేనొకసారి రసిక హృదయ భావనలో మునిగిపోనీ...**
**నా యీ శరీరాన్ని నీ చూపులతో సమీకరించి**
**నీ ఒడిలోకి తీసుకో.. హాయిగా, భద్రంగా నిదురపోతాను**
**నేను మళ్ళీ ఈ జీవితం చీకట్లోకి రానంటే రాను**
**నా గత జీవితంలోని మరకలన్నీ కడిగేసుకుంటాను**
**నేను రాబోయే చింతల నుంచి ఆపదల నుంచి**
**విముక్తి పొందాలని ఉంది.**
**నిన్నటి, రేపటి బాధల నుంచి**
**దూరం కావాలని ఉంది.**
**ఒక సురక్షిత స్థలానికి చేరాలని**
**నా ప్రేమను నాకివ్వు, ఆ శాశ్వతమైన నీ చూపు**
**మళ్ళీ ఒకసారి"** అని ముగించారు.

అలాగే "ప్రేమ రహస్యాన్ని దాచిపెట్టాను" "ఆవారా కుక్కలు" "మధుర ధ్వని" "నన్ను కొద్దిగా ఆలోచించనివ్వు" తదితర శీర్షికలతో ఫైజ్ కవితల్ని జంజం సత్యనారాయణ చక్కగా తెలుగులోకి అనువదించారు.

అలాగే ఈ గ్రంథంలో ఫైజ్ యొక్క కవిత్వాన్ని ఇంగ్లీష్‌లోకి తెచ్చిన రచయితలు ఖాలిద్ హమీద్ షాహితా యం.డి. మరియు బరాన్ ఫారుఖీగార్ల ఆంగ్ల కవితల్ని జంజం గారు మూలం దెబ్బతినకుండా తెలుగులోకి అనువదించారు.

ఇలా ఫైజ్ యొక్క కవిత్వంలోని కొన్ని కవితల్ని ఎంపిక చేసి..తెలుగు పాఠకులు ఆస్వాదించేలా అనువదించిన కవి, రచయిత జంజం సత్యనారాయణగారికి అభినందనలు తెలియజేద్దాం. అందమైన ముఖ చిత్రం మరియు ఫైజ్ ఛాయాచిత్రాలు గ్రంథానికి నిండు శోభను కూర్చాయి. అభ్యుదయ భావాలు ప్రేమ ప్రకటనకు ఆయన ప్రయోగించిన భావచిత్రాలు.. ఫైజ్ యొక్క బావుకతకు అద్దంపట్టే అనేక కవితలు పాఠకులకు.. వర్థమాన.. ప్రవర్థమాన కవులకు కావలసినంత మేధను సమకూర్చుతాయి. జంజం సత్యనారాయణగారి భాషా పటిమ.. సృజనాత్మక దృష్టి అనుశీలనాశక్తిని అందరం ప్రశంసించి తీరుతాం. ప్రతి ఒక్కరు చదువదగిన గ్రంథమిది. ప్రతి గ్రంథాలయంలో ఉండదగింది.

ప్రతులకు: కవి జనాశ్రయం
7-5-297, లక్ష్మీనగర్ కాలనీ
మహబూబ్‌నగర్-509 002.
సెల్: 98494 44944.



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## మనుగడకే ముప్పు

తెలిసి చేసినా, తెలియక చేసినా
తప్పు తప్పే.
తప్పుచేసి సమర్థించుకున్నా
తప్పించుకోవడానికి ప్రయత్నించినా
తప్పుచేసిన వారికి వత్తాసుపలికినా
తప్పుడు మార్గాలలో ప్రయాణించినా
తప్పు తప్పే!
పరధనముల్ హరించి
పరభామలనంటినా
పరాన్నమబ్బినా పాతకమని
రామదాసు చెప్పినట్లుగా
ఇతరుల సంపాదన గుంజుకోవడం
ఇతరుల స్త్రీలను హింసించి హత్యచేయడం
ఇతరుల బతుకుల్లో నిప్పులుపోయడం
తిన్నింటి వాసాలు లెక్కబెట్టడం
ఇతరుల నోటికాడి బుక్కను లాగేయడం
ఇతరుల ఎదుగుదలకు అడ్డం పడడం
ఇతరుల కాళ్ళల్లో కట్టెలు పెట్టడం
ఇతరులను మానసికంగా, శారీరకంగా
హింసించి పైశాచికానందం పొందడం
క్షమించరాని తప్పు!
తప్పులు జరగడం
మానవ సహజం
వాటిని సరిదిద్దుకుని
సక్రమ మార్గంలో నడవడం
మానవ లక్షణం!
తెలిసి చేసినా తెలియక చేసినా
తప్పు తప్పే!
లేదంటే
మానవ మనుగడకే ముప్పు!



– డా॥కూర్మాచలం
శంకరస్వామి
సెల్: 7702435110

## ఆదిభిక్షువు



శివామృత స్తోత్ర అక్షర సుమాలు
శివతత్వాన్ని ఆవిష్కరించే శుభ ఘడియలు
శివనామస్మరణలు.. ఓంకార శబ్దాలు
రుద్రాక్షధారనలు.. విబూతి అలంకరణలు
ఉపవాస దీక్షలు.. భజన జాగరణలు
ఢమరుకం వెతలు..నమకచమక మంత్రాలు
పరమశివునికన్నీ ప్రీతికర నియమాలే
ఒంటినిండా భస్మం.. మెడలో కాలసర్పం
కంఠాన కంకాళాల దండ.. జంతుచర్మధారి
పరమశివునికన్నీ ప్రీతికర నియమాలే
ఇదేగా నాదశరీరుడి ఆదిభిక్షువు ఆకారం !

శిరస్సు పై జలాన్ని.. కాసింత పత్రిని
భక్తసులభుడికి ఆర్తితో అర్పించ
పెరట్లో పాతేస్తాడు వరాల కల్పవృక్షాన్ని
స్నాన మంత్ర సత్య దాన దయలే కాదు
జ్ఞాన మనఃశుద్ధి ఇంద్రియ నిగ్రహాలు
అష్ట శౌచాలుగా మహేశ్వరునిలో మది
విలీనమేగా శివధ్యాన పవిత్ర ఘడియలు !

లయబద్ధంగా.. శృతి మధురంగా
మెరుపు వేగపు నాట్య విన్యాసమేగా
నటరాజు విశ్వరూప దర్శనం
చెల్లా చెదరు జటాజూటం
గజగజవణుకు తలపై గంగా
నేత్రపర్వం శివానంద తాండవ లీల !

సర్వజీవుల జనన మరణాలే
సృష్టి, స్థితి, లయల సంకేతాలంటూ
సాలీడు, నాగు, ఏనుగులనే కాదు..
మంత్రమే రాని భక్త కన్నప్పను సైతం
తనలో ఐక్యం చేసుకోగల కారుణ్య మూర్తి
భక్తజనులకు సదా నిత్య చైతన్య స్ఫూర్తి !
(శివరాత్రి పర్వదినం సందర్భంగా...)

– డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి
9949700037



డా॥ఎన్. గోపి సృష్టించిన 'నానీ' ప్రక్రియలో వందలాది నానీ సంకలనాలు వెలువడ్డాయి. గుంటూరు వాస్తవ్యుడు ఎం.ఎస్. సుభాని ఇటీవల వెలువరించిన "సామాజిక నానీలు" పుస్తకంలోని మరికొన్ని నానీలు చిత్రాలతో..






మసక వెలుగుల్లో
చిరిగిన చేనేత
జిలుగుతెచ్చే
'నేత' ఏడి...?

ర్యాంకులకోసం
పోరాటం
గొప్పకోసం
ఆడే ఆట ఆత్మవంచన



కాసుల కోసం
కోతలు
వైద్యో... నారాయణో హరి
నరకమిదే మరి!

ఆశలు ఆవిరై
నగ్నంగా శిశిరం
చిగిర్చే వసంతంకై
సాగే పయనం



నేటి చదువు
మార్కెట్ సరుకు
రేటుకి మాత్రం
రూల్సు వుండవు



ఉన్నతస్థానంలో
వుంటే మాత్రం...?
కుక్క తోక
ఎప్పటికీ వంకరేగా!

పొలం, హలం
శ్రమ, సేద్యం... రైతుదే
పంటమాత్రం
అదృశ్య శక్తులది



నిర్దయగా రాలుతున్న
పండుటాకులు
గ్రీష్మరూపాలు
కన్నకొడుకులు



కంప్యూటర్ తెరపై
ఆశల పంటలు
పండించగల
నేతలు మనలోనే



అమ్మలా ఎదురుచూస్తోంది
పల్లె
పాపం పిచ్చిది...
నగర పంజరంలో నేను

లక్ష్యం
గమ్యమా... గగనమా?
వాహన వేగం
ఊపిరితో పోటి



జ్ఞాపకాల్ని
గుండెలో నాటావు
నువ్వే ప్రాణమై
బతుకుతున్నా

అంపశయ్యపై
అమ్మభాష
చాపచుట్టేది
చదువుకున్నోళ్లే...!



పైన
శాలువా, దండ
లోపల డొక్కలు కప్పలేని
చిరుగుచొక్కా



నోరుఎండి
మోరెత్తిన ఊరు
కన్నీళ్లకు మాత్రం
కరువులేదు

# సమాజ వాస్తవ స్థితికి దర్పణం - జీవన నానీలు

పుస్తక సమీక్ష






Poetry is simply the most beautiful, impressive, and widely effective mode of saying things.

-Matthew Arnold

మనసులో కలిగిన ఒక భావనను మిక్కిలి అందంగా, మిక్కిలి ప్రభావాత్మకంగా, విశాల దృక్పథంతో వ్యక్త పరచు సాధనం కవిత్వం. అతి తక్కువ పదాలతో విస్తృతమైన భావాలను వెదజల్లే కవిత్వం మరింతగా పాఠకుని మది లో నాటుకుంటుంది. ఆ విధంగా గొప్ప భావ సాంద్రత తో వచ్చిన ప్రక్రియ నానీలు. అల్పాక్షరా ల్లో అనల్పార్థ రచన' అన్న పాల్కురికి సోమనాథుని మాటలకు ఆచరణ రూపం నానీల ప్రక్రియ. అతి తక్కువ పదాలతో విస్తృతమైన అర్థాన్ని ప్రోది చేయడమే కాక పాఠకుడిలో ఆలోచనను రేకెత్తించే విశిష్ట ప్రక్రియ నాని. సాహిత్య ప్రస్థానంలో నానీల ప్రక్రియ కొత్త ఒరవడిని సృష్టిస్తోంది. లబ్ధ ప్రతిష్ఠులైన కవులతో పాటు వర్తమాన కవులూ నానీల ప్రక్రియ ద్వారా తమ కవితలను వెలుగులోకి తెస్తున్నారు

నానీలు ఒక లఘు కవితా ప్రక్రియ. ఓ వస్తువును ఎంపిక చేసుకొని క్లుప్తంగా మనసుకు ఆకట్టుకునే విధంగా ఆవిష్కరిస్తారు. ఈ ప్రక్రియలో నాలుగు పాదాలుగా, 20 నుంచి 25 అక్షరాల నిడివితో ఉంటాయి. మొదటి రెండు పాదాలు ఒక యూనిట్ అయి తే మలి రెండు పాదాలు మరో యూనిట్. తొలి సగంలో కవి ఒక సత్యాన్ని చెబుతాడు. మలి సగంలో దాని కొనసాగింపుగా వ్యాఖ్యానం, సమర్థింపు ఉంటుంది. నానీలో పాద నియమం లేకున్నా, అక్షర నియమం ఉంటుంది. ఒక్కో నానీలు 20 అక్షరాలకు తగ్గకుండా, 25 అక్షరాలకు మించకుండా ఉండాలి.

ఎంత జటిలమైన సామాజిక సమస్యనైనా నానీలలో అలవోకగా ఆవిష్కరించవచ్చు. సరళంగా స్పష్టంగా సూటిగా పాఠకుని మదిలోకి విషయాన్ని ఇంజెక్ట్ చేయగలిగిన నానీలు అతి కొద్ది కాలంలోనే జనాదరణ పొందగలిగాయి. జగిత్యాల జిల్లా వస్తాపూర్ కు చెందిన కవయిత్రి మార విజయలక్ష్మి మార రచించిన 'జీవన నానీలు' ఈ కోవలోకి చెందినవే. చక్కని అభివ్యక్తి, గొప్ప భావ స్ఫురణ అవసరమైన చోట అందమైన అంత్యప్రాసలు జీవన నానీల ప్రత్యేకతలు.

ఈ కవయిత్రి కి సామాజిక స్పృహ, పర్యావరణ స్పృహ మెండు.

**'ఇంకుడు గుంతలు**
**నిర్మించు**
**ఇంకిపోయిన జలాలను**
**నిలుపు'** అంటూ నీటి పొదుపు ఆవశ్యకతను, ఇంకుడు గుంతల అవసరాన్ని తెలియపరుస్తారు. జీవన నానీలు చదివితే చక్కని భావ చిత్రాలు పాఠకుల మనసులపై ముద్రితం అవుతాయి

**" టుంగుటూయలే**
**నీ ముంగురులు**
**సమీరానికి సొంతంగా**
**కదలాడుతూ..."** ఎంత గొప్ప భావ చిత్రం... నిజంగా ముంగురులను ఉయ్యాలగా ఊహించడమే అందమైన భావన. అందమైన వెన్నెల రాత్రుల గురించి ఎన్నో అందమైన నానీలను చెప్పింది కవయిత్రి. ప్రకృతి సంబంధ వర్ణనలను, ప్రేమమయ సంబంధాలను ఎంత శాంతంగా వ్యక్తీకరించినదో స్త్రీలపై జరిగే అరాచకాలను నిరసించే క్రమంలో అపర కాళికలా తన కలాన్ని ఝుళిపించింది.

**"ఆడపిల్ల అందాన్ని**
**క్షణంలోనే పీక నులిమాడు**
**ఎంత కసాయో**
**వాడు"** ఇటీవల సంఘటనలను గుర్తుకు తెస్తున్నది ఈ నాని. స్త్రీలపై జరుగుతున్న అమానవీయ సభ్య సమాజం తలదించుకునే సంఘటనలను కళ్లకు కట్టినట్లు అక్షరబద్ధం చేశారు.

**"భ్రూణ హత్యలే నయమేమో**
**కర్కశంగా**
**సామూహిక అత్యాచారం**
**కంటేను"** రచయిత్రి ఆవేదన నేటి సమాజ ఆవేదన. పెరుగుతున్న పాశ్చాత్య ప్రభావం వల్ల అనాదిగా సమాజంలో ఉన్న విలువలు నశించి పోవడం వల్ల స్త్రీలకు నానాటికీ రక్షణ కొరవడుతోంది.

**"సంతలో విలాస వస్తువు కాదు**
**స్త్రీ**
**సామూహికంగా**
**పందుల్లా దొర్లడానికి"** అంటూ కామాంధుల పట్ల తీవ్రమైన నిరసన స్వరాన్ని వినిపిస్తారు. పసిగుడ్డు లను సైతం వదలని మానవ మృగాలను రచయిత్రి ఆవేదనతో ప్రశ్నించింది

**"పసిపిల్లలు రా వాళ్ళు**
**వయసంటే ఏంటో**
**తెలియకనే**
**మసి చేస్తున్నారే... "** అని మండిపడుతుంది. నిజంగా ఇటీవల హనుమకొండ లోజరిగిన 13 నెలల చిన్నారి దుర్ఘటనను జ్ఞప్తికి తెస్తుంది ఈ నాని. జీవన నానీలన్నీ వాస్తవ సామాజిక స్థితులకు దర్పణం పడుతున్నాయి.

స్త్రీ జీవిత ఔన్నత్యాన్ని చాటిచెప్పే నానీలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి.

**"చుక్కల ముగ్గులన్నీ**
**సులువే ఆమెకు**
**చిక్కుముళ్ల**
**జీవితానుభవం"** అంటూ స్త్రీ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోగలదని తేల్చి చెప్పింది.

**"స్త్రీ అంటే**
**అంత అలుసా**
**మనసు సప్తసముద్రాలంత**
**లోతని తెలుసా"** అంటూ స్త్రీ మనసు యొక్క విస్తృతిని తెలియ చెబుతుంది. రచయితలు కుల,మత, జాతి భేదాలకు అతీతంగా విశ్వమానవ సంక్షేమాన్ని కోరే వారు అయి ఉండాలి. కానీ కుల మతాల చట్రంలో ఇరుక్కు పోతున్నారని తెలియజేస్తూ కవులకు చక్కని చురకలు అంటించింది.

**"రచయితలు**
**రంగస్థలం ఎక్కారు**
**కులాల**
**కుమ్ములాటలతో"** ఇలా ఇజాలకు పరిమితమై పోయిన రచయితలు నిజాలను సమాధి చేస్తున్న వైనాన్ని చక్కగా చిత్రీకరించింది. రచయిత్రి టీచర్ కాకపోయినా పుస్తకాల బరువు పై, బడిబాట కార్యక్రమం పై చక్కని అవగాహనతో కూడిన నానీలను వెలువరించింది. రాజకీయాలలో ఉన్న అవినీతిని ఎండగడుతూ

**"పథకాలు**
**పక్క దార్లోకి**
**బినామీ పేర్లతో**
**కాలర్ ఎగరేస్తూ"** అంటూ స్వార్థపూరిత రాజకీయ నాయకులు ప్రజల సొమ్మును కాజేస్తున్న వైనాన్ని తూర్పారాబట్టింది. హరితహారం, ఎన్నికల వ్యవస్థ, రైతు జీవితం, మద్యం అనర్థాలు అవయవ దానం ఆవశ్యకత, ప్రకృతి సౌందర్యం, మానవ సంబంధాలు, ప్రేమ, స్వచ్ఛభారత్ తదితర అంశాలపై మిక్కిలి బాధ్యతాయుతంగా నానీలను రాసింది.

విజయలక్ష్మి గారి జీవన నానీలకు "నానీల నాన్న" ఆచార్య డాక్టర్ ఎన్.గోపి గారి ఆశీస్సులు అదనపు ఆకర్షణ. చక్కని భావ వ్యక్తీకరణ స్పష్టమైన సామాజిక స్పృహ కలిగిన ఈ రచయిత్రి నుండి ఉత్తరోత్తర మరిన్ని ఉత్తమ కావ్యాలను ఆశించడం అతిశయోక్తి కాదు

**ప్రతులకు:** విజయలక్ష్మి మార
ఇ.నెం. 2-5-225/1
పురానీపేట్, జగిత్యాల-505 327
సెల్:9533333191



**- సాగర్ల సత్తయ్య నల్లగొండ**
7989117415



కలలున్నాయి
గమ్యాలున్నాయి
ఫలితాలూ ఉన్నాయి
లేనిది... కృషి

జానెడు పొట్ట
దహించే ఆకలి
వలసజీవితాలు
ఎడారిపాలు...!



చెంతనేఉన్నా
కానరాని దూరాలు
దరిచేరని
దగ్ధజీవితాలు

నల్లబడి సూర్యుడు
కందిపోయాడు
కబళించిన
కాలుష్యం



త్రివేణి సంగమాల
పవిత్రభూమి
మంచినీటికేమిటి
ఈ... లేమి?



ఇంచుమించు
దొంగతనమే
శ్రమలేని
ఉచిత సంపాదన

ఇక్కడా
దోపిడేనా?
వరద బురదలో
కుళ్లిన మానవత్వం





రాక్షస కౌగిట్లో
పుడమి
భక్షణ భజనలో
రాబందులు

జగతికి జీవం
సుజలం
కలుషితమైతే
కన్నీరూ... గరళం!



అంతా
మాయాజాలం
ఆడిస్తాడో... ఆర్పేస్తాడో
మార్కెట్ మాంత్రికుడు!

నెత్తుటివరద
సాక్షిగా
యుద్ధం
విశ్వశాంతి కోసమేనట!



స్వార్థపు మంటలు
భగభగ
మూల్యం చెల్లించేదీ
మనిషేగా...




విద్యావిపణిలో
బలిపశువు విద్యార్థి
కసాయితనం
కన్నవాళ్లదే!

మృత్యువుకు
భయపడదు 'కలం'
అక్షరాన్ని సంధించి
క్రాంతిని తెస్తుంది




గ్లాసులు గలగల
గల్లాపెట్టె కళకళ
ఇక
ప్రజారోగ్యం వెలవెల



చదివేది ఎల్‌కెజి
వీపులపై కేజీల లగేజి
శిలువ మోస్తూ
బాలయేసులు

ఇప్పుడందరిదీ
'మందు'చూపే
ముందుచూపెప్పుడో
మటుమాయం



గుండెనెక్కడో
తాకిన మాటల తూటా
కంట్లో ఉబికిన
కన్నీటి ఊట

(ఇంకా వుంది..)

